وَهٰذَا الْبَلَدِ الْاَمِيْنِ ۝

3. ఈ శాంతి నగరం (మక్కా) సాక్షిగా![1]

لَقَدْ خَلَقْنَا الْاِنْسَانَ فِيْٓ اَحْسَنِ تَقْوِيْمٍ ۝

4. వాస్తవంగా! మేము మానవుడిని సర్వశ్రేష్ఠమైన ఆకారంలో సృష్టించాము.[2]

ثُمَّ رَدَدْنٰهُ اَسْفَلَ سٰفِلِيْنَ ۝

5. తరువాత మేము అతన్ని దిగజార్చి అధమాతి అధమమైన స్థితికి మార్చాము.

اِلَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ فَلَهُمْ اَجْرٌ غَيْرُ مَمْنُوْنٍ ۝

6. కాని విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు తప్ప! ఎందుకంటే అలాంటి వారికి అంతులేని ప్రతిఫలం ఉంది.

فَمَا يُكَذِّبُكَ بَعْدُ بِالدِّيْنِ ۝

7. అయితే, (ఓ మానవుడా!) దీని తరువాత గూడా నీవు ఎందుకు ప్రతిఫలదినాన్ని తిరస్కరిస్తున్నావు?

اَلَيْسَ اللّٰهُ بِاَحْكَمِ الْحٰكِمِيْنَ ۝

8. ఏమీ? అల్లాహ్ న్యాయాధిపతులలో కెల్లా సర్వోత్తమ న్యాయాధిపతి కాడా?

## 96. సూరహ్ అల్-'అలఖ్

سُوْرَةُ الْعَلَقِ

అల్-'అలఖ్: The Germ Cell, The Clot, పిండం, జీవకణం, రక్తముద్ద, జలగ, దీని మరొక పేరు సూరహ్ **అల్-ఇఖ్‌రఅ', చదువు**, పఠించు, దీని మొదటి ఐదు ఆయత్‌లతో దివ్యజ్ఞాన (ఖుర్ఆన్) అవతరణ ప్రారంభమయ్యింది. ఇవి రమ'దాన్ నెల చివరి పది రోజులలో ప్రస్థానానికి (హిజ్‌రత్‌కు) 13 సంవత్సరాలకు ముందు, (610వ క్రీస్తు శకం)లో దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) 40 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, నూర్ పర్వతం మీద, 'హిరా గుహలో అవతరింపజేయబడ్డాయి. మిగతా ఆయత్‌లు (6-19), ఈ మొదటి వ'హీ అవతరింపజేయబడిన కొంత కాలం (ఫత్‌రతుల్ వ'హీ) తరువాత అవతరింపజేయబడ్డాయి. **19 ఆయతుల** ఈ సూరహ్ మక్కాలో అవతరింపజేయబడింది.

---

1. ఈ శాంతి నగరం అంటే మక్కా ముకర్రమా చూడండి, 2:126. ఇందులో యుద్ధం చేయటం నిషేధించబడింది. ఇందులో ప్రవేశించిన వానికి శాంతి, భద్రతలు లభిస్తాయి. కొందరి అభిప్రాయం ప్రకారం ఇది మూడు చోట్లను సూచిస్తుంది. (1) 'తూర్ పర్వతం- మూసా ('అ.స.)ను ప్రవక్తగా ఎన్నుకోబడ్డ స్థలం, (2) బైతుల్ ముఖద్దస్-'ఈసా ('అ.స.) పుట్టి ప్రవక్తగా ఎన్నుకోబడ్డ స్థలం, (3) మక్కా ముకర్రమా - ము'హమ్మద్ ('స'అస) పుట్టి ప్రవక్తగా ఎన్నుకోబడ్డ స్థలం. (ఇబ్నె-కసీ'ర్). మక్కా ప్రస్తావనకు ఇంకా చూడండి, 48:24.

2. చూడండి, 91:7, 87:2 మరియు 75:38.

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

1. చదువు! నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు![1]

اقْرَأْ بِاسْمِ رَبِّكَ الَّذِي خَلَقَ ①

2. ఆయనే మానవుణ్ణి రక్తముద్ద (జీవకణం)తో సృష్టించాడు.[2]

خَلَقَ الْإِنسَانَ مِنْ عَلَقٍ ②

3. చదువు! మరియు నీ ప్రభువు పరమదాత.

اقْرَأْ وَرَبُّكَ الْأَكْرَمُ ③

4. ఆయన కలం ద్వారా నేర్పాడు.[3]

الَّذِي عَلَّمَ بِالْقَلَمِ ④

5. మానవుడు ఎరుగని జ్ఞానాన్ని అతనికి బోధించాడు.

عَلَّمَ الْإِنسَانَ مَا لَمْ يَعْلَمْ ⑤

6. అలాకాదు! వాస్తవానికి, మానవుడు తలబిరుసుతనంతో ప్రవర్తిస్తాడు.

كَلَّا إِنَّ الْإِنسَانَ لَيَطْغَىٰ ⑥

7. ఎందుకంటే, అతడు తనను తాను నిరపేక్షాపరుడిగా భావిస్తాడు.

أَن رَّآهُ اسْتَغْنَىٰ ⑦

8. నిశ్చయంగా నీ ప్రభువు వైపునకే (అందరికీ) మరలి పోవలసి ఉంది.

إِنَّ إِلَىٰ رَبِّكَ الرُّجْعَىٰ ⑧

9. నీవు నిరోధించే వ్యక్తిని చూశావా?[4]

أَرَأَيْتَ الَّذِي يَنْهَىٰ ⑨

---

1. దైవదూత జిబ్రీల్ ('అ.స.) దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) 'హిరా గుహలో దైవారాధనలో నిమగ్నులై ఉన్నప్పుడు వచ్చి అన్నారు: "చదువు!" అతను అన్నారు: "నాకు చదువురాదు!" అప్పుడు జిబ్రీలు ('అ.స.) అతనిని పట్టుకుని గట్టిగా అదిమి అన్నారు: "చదువు!" దైవప్రవక్త ('స'అస) తిరిగి అదే జవాబిచ్చారు. ఈ విధంగా అతను దైవప్రవక్త ('స'అస)ను మూడుసార్లు అదిమారు. వివరాలకు చూడండి, బద'అల్-వ'హీ, 'స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం, తిర్మిజీ', నసాయి'. ఆ తరువాత ఈ మొదటి ఐదు ఆయతులు చదివి వినిపించారు.
2. అల్-'అలఖతు: అంటే, The Clot of Blood, Leech like Substance, రక్తముద్ద, షిలగ, జలగ, పిండం, జీవకణం అనే అర్థాలున్నాయి.
3. ఖలమున్: కలం. అంటే చెక్కటం. మొదట కలమును చెక్కి తయారు చేసేవారు. మానవుని జ్ఞానంలో ఉన్నది - అతని వెంట వెళ్ళిపోతుంది. నోటితో పలికింది కూడా - దాచి పెట్టటానికి పనికి రాదు. కాని కలంతో వ్రాసి పెట్టింది చెడి పోకుండా భద్రంగా ఉంచితే చాలా కాలం వరకు ఉంటుంది. కలం వల్లనే ప్రాచీన జ్ఞానం భద్రపరచబడింది. కావున అల్లాహ్ (సు.తా.) మొట్టమొదట కలాన్ని సృష్టించి దానితో పునరుత్థానదినం వరకు సర్వసృష్టి యొక్క విధిని వ్రాయించాడు.
4. ఈ నిరోధించే వ్యక్తి అబూ-జహల్ అని చాలామంది వ్యాఖ్యాతల అభిప్రాయం.

عَبْدًا إِذَا صَلَّىٰ ⑩

10. నమాజ్ చేసే (అల్లాహ్) దాసుణ్ణి?[1]

أَرَأَيْتَ إِن كَانَ عَلَى الْهُدَىٰ ⑪

11. ఒకవేళ అతను (ము'హమ్మద్!) సన్మార్గంపై ఉంటే నీ అభిప్రాయమేమిటి?

أَوْ أَمَرَ بِالتَّقْوَىٰ ⑫

12. ఇంకా, దైవభీతిని గురించి ఆదేశిస్తూ ఉంటే?[2]

أَرَأَيْتَ إِن كَذَّبَ وَتَوَلَّىٰ ⑬

13. ఒకవేళ (ఆ నిరోధించే) వాడు[3] సత్యాన్ని తిరస్కరించేవాడు మరియు సన్మార్గం నుండి విముఖుడయ్యే వాడైతే?

أَلَمْ يَعْلَم بِأَنَّ اللَّهَ يَرَىٰ ⑭

14. వాస్తవానికి, అల్లాహ్ అంతా చూస్తున్నాడని అతనికి తెలియదా?

كَلَّا لَئِن لَّمْ يَنتَهِ لَنَسْفَعًا بِالنَّاصِيَةِ ⑮

15. అలా కాదు! ఒకవేళ అతడు మానుకోక పోతే, మేము అతడిని, నుదుటి జుట్టు వెంట్రుకలను పట్టి ఈడుస్తాము.[4]

نَاصِيَةٍ كَاذِبَةٍ خَاطِئَةٍ ⑯

16. అది అబద్ధాలలో, అపరాధాలలో మునిగి వున్న నుదురు!

فَلْيَدْعُ نَادِيَهُ ⑰

17. అయితే, అతన్ని తన అనుచరులను పిలుచుకోమను!

سَنَدْعُ الزَّبَانِيَةَ ⑱

18. మేము కూడా నరక దూతలను పిలుస్తాము!

كَلَّا لَا تُطِعْهُ وَاسْجُدْ وَاقْتَرِب ۩ ⑲

19. అలాకాదు! నీవు అతని మాట వినకు మరియు ఆయన (అల్లాహ్)కే సాష్టాంగం (సజ్దా) చెయ్యి మరియు ఆయన (అల్లాహ్) సాన్నిధ్యాన్ని పొందటానికి ప్రయత్నించు! ۩

---

1. దాసుడు - ఇక్కడ దైవప్రవక్త ('స'అస).
2. తఖ్వా: దైవభీతి, భయభక్తి, ఖుర్ఆన్ అవతరణలో ఇక్కడ మొదటిసారి వచ్చింది. ఏక దైవత్వాన్ని దృఢంగా విశ్వసించటం, భక్తిని, ఆరాధనను కేవలం అల్లాహ్ (సు.తా.) కొరకే ప్రత్యేకించుకోవటం మరియు సత్కార్యాలు చేయుటం.
3. ఈ నిరోధించే వ్యక్తి అబూ-జహల్ అని చాలామంది వ్యాఖ్యాతల అభిప్రాయం.
4. చూడండి, 11:56.